క్లుప్తంగా

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి మండల పరిధిలోని వివేకానందనగర్, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, కూకట్‌పల్లి డివిజన్లకు చెందిన 30 మంది కల్యాణలక్ష్మీ, షాదీముబాక్ లబ్ధిదారులకు సోమవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్‌గౌడ్, రాగం నాగేందర్ యాదవ్‌ల తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ సమస్యలను పరిష్కరిస్తా

- కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలో వాటర్ వర్క్స్ డీజీఎం ప్రియ, మేనేజర్ సతీష్‌తో కలిసి బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి సోమవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ నగర్, శ్రీశ్రీనగర్ స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాజీవ్‌గాంధీ నగర్‌కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, ప్రధాన కార్యదర్శి ఎన్ఙె నరేష్ పాల్గొన్నారు.

పార్కు పనులను పరిశీలించిన కార్పొరేటర్



పార్కు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్ డివిజన్‌లోని పటేల్ కుంట పార్కులో అభివృద్ధి పనులను సోమవారం వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు హెచ్ఎండిఏ డీఈ రామారావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాటర్ పాండ్, వాకింగ్ ట్రాక్ పనులు వర్షాకాలం రాకముందే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఏఇ నైనశ్రీ, ఆర్కిటెక్చర్ శ్రీలేఖ, పటేల్ కుంట పార్కు సభ్యులు చెన్నారావు, రవీంద్రరావు, జగదీష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి యాదగిరికి గద్దర్ ఐకాన్ అవార్డ్

కుత్బుల్లాపూర్: సమాజ సేవకుడు, గాయకుడిగా సేవలందించిన కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన శివరాత్రి యాదగిరి గద్దర్ ఐకాన్ అవార్డును అందుకున్నారు. సాయి అలేఖ్య సంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో భాస్కర ఆడిటోరియంలో వేణుగోపాలచారి అధ్యక్షతన జరిగిన గద్దర్ ఐకాన్ అవార్డు-2024 కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ చేతుల మీదుగా శివరాత్రి యాదగిరి అవార్డును అందుకున్నారు. శివరాత్రి యాదగిరి 1992 నుంచి ఆల్ ఇండియా రేడియోలో వందలాది జానపద గేయాలు పాడి పలు అవార్డులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, తెలంగాణ సాంస్కృతిక శాఖ చైర్మన్ వెన్నెల గద్దర్, ప్రజా గాయని విమలక్క హాజరయ్యారు.

ఆర్థిక సాయం అందజేత

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల గ్రామానికి చెందిన వేగేశన ప్రేమావతి(59)కి మెదడులో రక్తం గడ్డ కట్టడంతో ప్రైవేట్ ఆసుపత్రిలో సర్జరీ చేయించారు. పేద కుటుంబం ఇల్లు గడవడం కష్టం కావడంతో స్థానికులు క్షత్రియ కల్చరల్ అసోసియేషన్ సభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకుని బాధితురాలి నివాసానికి వెళ్లి రూ. 15వేల చెక్కు అందజేసి భరోసా ఇచ్చారు.

నత్తనడకన నాలా విస్తరణ

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ సున్నం చెరువు నుంచి మైసమ్మ చెరువు వరకు నాలా విస్తరణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. వర్షాలు కురిసినప్పుడు నాలాకు ఇరువైపులా ఉన్న నివాసితులు ఇళ్లలోకి వర్షపు నీటితో పాటు మురుగు నీరు ప్రవహించటంతో ఇళ్లలోని వస్తువులు నీట మునిగి నిద్రలేని రాత్రులు గడపవలసిన పరిస్థితి నెలకొంది. నాలా విస్తరణ చేపట్టే సమయంలో కొంతమంది నిర్మాణదారులు నాలాను ఆక్రమించుకొని నిర్మాణాలను చేపడుతున్నారు. పనులను పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించటంతో నాలాలు రోజు రోజుకూ కుచించుకు పోతున్నాయి. ఒక పక్క ప్రభుత్వం నాలా విస్తరణ, సుందరీకరణ పనులు వచ్చే వర్షాకాలం నాటికి పూర్తి చేయాలని ఆదేశిస్తున్నప్పటికీ కొంతమంది నిర్మాణదారులు నాలాను అడ్డం పెట్టుకొని ఆక్రమణలకు పాల్పడుతున్నారు. గతంలో నాలా పనులు పలుమార్లు ప్రారంభించినా పూర్తి కాకపోవటంతో తిరిగి ప్రారంభించిన పనులే మళ్లీ మళ్లీ ప్రారంభించి చేతులు దులుపుకుంటున్నారు. గతంలో సఫ్దార్‌నగర్‌లో నాలాకు అడ్డుగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను గత ప్రభుత్వం తొలగించి వారికి దూర ప్రాంతంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను మంజూరు చేశారు. కానీ వారి ఇక్కడున్న ఇళ్లను వదిలి వెళ్లటానికి ఆసక్తి చూపలేదు. అకాల వర్షాలు కురిసినప్పుడు గత ప్రభుత్వం ఇళ్లు మునిగిపోయిన వారికి ఆర్థిక సహాయం అందజేసింది. వర్షాకాలం ప్రారంభం అయ్యే లోపే నాలా విస్తరణ పనులు వేగవంతంగా పూర్తి అయితే అకాల వర్షాలు కురిసినప్పుడు తమకు ఇళ్లు మునిగి పోకుండా బాధల నుంచి విముక్తి కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సున్నం చెరువు నుంచి పద్మావతినగర్, జ్యోతినగర్, గాయత్రినగర్, లక్ష్మీ నగర్, అల్లాపూర్, ఫ్రెండ్స్ కాలనీ, సఫ్దార్‌నగర్, యూసుఫ్ నగర్, రాజీవ్ గాంధీ నగర్‌ల వరకు ఈ నాలా విస్తరణ పనులు కొనసాగుతున్నాయి.



సఫ్దార్‌నగర్‌లో నాలాలో పేరుకుపోయిన చెత్తా చెదారం



పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియను సులభతరం చేయాలి

కేపీహెచ్‌బీకాలనీ: దళిత, గిరిజన, బలహీన వర్గాల విద్యార్థులు పీహెచ్‌డీ చేసేలా అడ్మిషన్ల ప్రక్రియను సులభతరం చేయాలని కోరుతూ జేఎన్‌టీయూహెచ్ స్టూడెంట్ ప్రొటెక్షన్ ఫోరం నాయకులు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ బాలునాయక్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫోరం నాయకులు పూల అరవింద్ కుమార్ మాట్లాడుతూ.. అనేక మంది విద్యార్థులు ఎంటెక్ పూర్తి చేసి పీహెచ్‌డీలు చేయటానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. అందుకు అనుగుణంగా విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు పీహెచ్‌డీ నోటిఫికేషన్ విడుదల చేయాలని, అయా పీహెచ్‌డీ నోటిఫికేషన్‌లో నియమ నిబంధనలను దళిత గిరిజన బలహీన వర్గాల విద్యార్థులకు ఎక్కువ మందికి పీహెచ్‌డి అడ్మిషన్‌లు పొందేలా రూపొందించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ బాలు నాయక్ మాట్లాడుతూ ఎక్కువ మంది విద్యార్థులకు పీహెచ్‌డీ చేసే అవకాశం కల్పించేవిధంగా ఆలోచిస్తున్నామని, సాధ్యమైనంత త్వరలో ఉపకులపతితో చర్చించి నియమ నిబంధనలను రూపొందిస్తామన్నారు.



డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ బాలునాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్టూడెంట్ ప్రొటెక్షన్ ఫోరం నాయకులు

అల్లాపూర్ పోలీసుల ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

మోతీనగర్: బాటసారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని కూకట్‌పల్లి ఏసీపీ కె. శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలీసులు సేవా దృక్పథంతో పనిచేస్తారన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు

సమస్యలపై ఎంపీ ఈటలకు వినతి

దుండిగల్: దుండిగల్ మున్సిపల్ పరిధిలో నెలకొన్న సమస్యలపై బీజేపీ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి నేతృత్వంలో సోమవారం మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్‌లో మంజూరై పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు. వినతి ఇచ్చిన వారిలో ప్రభాకర్‌రెడ్డి, కొమ్ము ప్రశాంత్, మహిళా నాయకురాలు రోజా ఉన్నారు.

అక్రమ వలసదారులు దేశం వదలి వెళ్లాలి

కూకట్‌పల్లి: దేశంలో అక్రమంగా ఉంటున్న పాకిస్థాన్, బంగ్లాదేశ్, అక్రమ చొరబాటుదారులు వెంటనే భారతదేశాన్ని వీడాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీజేపీ కూకట్‌పల్లి అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టారు. బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎస్. మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులతో కలిసి జాతీయ జెండాలు, ఫ్లెక్సీలు, ప్లకార్డులు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ ఉగ్రదాడి జరిగినా దాని మూలాలు పాకిస్తాన్‌లో ఉంటాయన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో చొరవ తీసుకొని అక్రమ వలసదారులను వెనక్కి పంపాలని, ఇది మన దేశ భద్రతకు సంబంధించిన విషయమని అన్నారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, నాయినేని సూర్యప్రకాష్ రావు పాల్గొన్నారు.



బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న మల్లారెడ్డి, మాధవరం కాంతారావు, తదితరులు

కాలనీలో కార్పొరేటర్ పాదయాత్ర

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ భరత్‌నగర్‌కాలనీ ఎస్‌పీ నగర్ కాలనీలో సోమవారం ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ స్థానిక సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రలో భాగంగా స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మంచినీటి లో ప్రెషర్ సమస్య, విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతున్నాయన్నారు. విద్యుత్ వైర్ల సమస్యలు త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్‌పీ నగర్ అధ్యక్షులు కార్తీక్, ప్రధాన కార్యదర్శి వినోద, మాజీ అధ్యక్షురాలు జ్యోతి గౌడ్ పాల్గొన్నారు.



ఎస్‌పీ నగర్‌లో పాదయాత్ర చేస్తున్న కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్, తదితరులు

ప్రతి కాలనీ, బస్తీని అభివృద్ధి చేస్తాం

కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్



నాలా విస్తరణ చేయనున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జగదీశ్వర్‌గౌడ్, అధికారులు

చందానగర్: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ప్రతి కాలనీ, బస్తీని అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి, గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులు జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని హుడా కాలనీ విద్యావాణి పాఠశాల వద్ద నాలా విస్తరించాల్సిన ప్రాంతాన్ని సంబంధిత అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కాలనీ, బస్తీలలో పర్యటించి సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. ప్రజలు తమ సమస్యలను తెలియజేయాలన్నారు. పర్యటనలో ఇంజినీరింగ్, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి, ఇరిగేషన్ శాఖ అధికారులు అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

శాంతిసరోవర్‌లో ‘కిడ్స్ సమ్మర్ క్యాంప్’

16 నుంచి 18 వరకు నిర్వహణ

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ‘కిడ్స్ సమ్మర్ క్యాంప్’ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 9 ఏళ్ళ నుంచి 14 ఏళ్ళ లోపు పిల్లలకు అవకాశం కల్పిస్తారు. రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో ‘మైండ్‌ల్యాబ్, సెల్ఫ్ టాక్, క్రియేటివ్ మెడిటేషన్, మెమరీ పవర్, వాల్యూ యాక్టివిటీస్, డిజిటల్ వెల్‌నెస్’ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమంలో ముంబాయికి చెందిన రాజయోగ టీచర్ బి.కె. రితు టక్కర్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు .మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23001234, సెల్ ఫోన్ 8143466670లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

కలెక్టర్ కార్యాలయానికి క్యూ

- కిందిస్థాయి అధికారులు పట్టించుకోకపోవడంతో..
- ప్రజావాణిలో 91 ఫిర్యాదులు
- జిల్లాస్థాయి అధికారులు స్పందించాలి
- గైర్హాజరయ్యే అధికారులపై చర్యలు తప్పవు
- జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ హరిప్రియ



సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశపు హాలులో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని జిల్లా ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్(రెవెన్యూ) హరిప్రియకు పదుల సంఖ్యలో ఫిర్యాదులతో కూడిన దరఖాస్తులను సమర్పించారు. సమస్యలపై సంబంధిత అధికారులు సకాలంలో స్పందించకపోవడంతో ప్రజలు అవే సమస్యలపై ఫిర్యాదులు అందజేస్తున్నారు. నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించి ప్రజావాణిలో 25 ఫిర్యాదులు అందాయి అంటే పరిస్థితి ఏవిధంగా ఉందో తెలిసిపోతోంది. ప్రజావాణి ఫిర్యాదులపై సీరియస్ సమీక్ష లేకపోవడంతో పాటు నిర్లక్ష్యం చేసిన సంబంధిత శాఖ అధికారిపై ఇప్పటి వరకు శాఖాపరమైన చర్యలు లేకపోవడంతో వాటిని సాధారణ దరఖాస్తుగా పరిగణిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

- వివిధ ప్రాంతాలు, బస్తీలు, గ్రామాల నుంచి వచ్చిన పలువురు ప్రజలు, మహిళల సంక్షేమ పథకాలకు సంబంధించి పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల కోసం ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు. భూకబ్జాలు, ప్రభుత్వ, అసైన్డ్ భూముల ఆక్రమణలపై 32 ఫిర్యాదులు రాగా, పురపాలక సంఘాల్లో అక్రమ భవన నిర్మాణాలు, అనుమతి లేకుండా బహుళ అంతస్తుల నిర్మాణాలపై అత్యధికంగా 23 ఫిర్యాదులు వచ్చాయి. పోచారం, నాగారం, దమ్మాయిగూడ, పీర్జాదిగూడ, మేడ్చల్, ఘట్‌కేసర్, జవహర్‌నగర్, కొంపల్లి, తూముకుంట పురపాలక సంఘాలతో పాటు గాజులరామారం, కుత్బుల్లాపూర్, అల్వాల్ మున్సిపల్ సర్కిళ్లకు సంబంధించిన వాటిపై పెద్ద ఎత్తున ప్రజావాణిలో ఫిర్యాదులు అందాయి.
- విద్యాశాఖకు ఐదు, హౌసింగ్‌కు ఐదు, పంచాయతీశాఖకు రెండు, కీసర ఆర్డీఓకు సంబంధించి ఎనిమిది, ఏడీ సర్వేకు నాలుగు, శాఖలకు సంబంధించిన వాటితో సహా మొత్తం ప్రజావాణిలో పెద్ద ఎత్తున 91 ఫిర్యాదులు అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో కలెక్టరేట్ విభాగం రెవెన్యూ అధికారి రాజేశ్వర్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిల్లా అధికారులు తక్షణమే స్పందించాలి

వివిధ శాఖల అధికారులు, ముఖ్యంగా పురపాలక సంఘాల కమిషనర్లు సకాలంలో ప్రజా సమస్యలను పరిష్కరించకపోవడంతో ప్రజలు పదే, పదే ప్రజావాణిలో ఫిర్యాదులను అందజేస్తున్నారని జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ హరిప్రియ అన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే ఫిర్యాదులను పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ఎలాంటి అనుమతి లేకుండా గైర్హాజరయ్యే అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. అలాంటి అధికారులు ఉంటే వెంటనే నోటీసులు జారీ చేయాలని ఆమె ఆదేశించారు.

వరద సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం

కుత్బుల్లాపూర్: వర్షాకాలంలో వరదనీరు చేరకుండా శాశ్వత పరిష్కారం చూపిస్తామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సోమవారం గాజులరామారం డివిజన్ ఓక్షిత హిల్‌వ్యూ కాలనీలో ఎమ్మెల్యే అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న డ్రైనేజీ, వరదనీటి సమస్యను పరిశీలించిన ఆయన యుద్ధ ప్రాతిపదికను పనులు చేపట్టి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వివేకానంద్ మాట్లాడుతూ.. ప్రతి వర్షాకాలంలో ఓక్షిత హిల్ వ్యూ కాలనీని వరదనీరు ముంచెత్తడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, భూగర్భ డ్రైనేజీ, డ్రెయిన్ లైన్లను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట ఎస్‌ఈ చెన్నారెడ్డి, ఈఈ కిష్టప్ప, వాటర్ వర్క్స్ అధికారులు, నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, ఓక్షిత హిల్ వ్యూ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణ, సురేందర్ ఉన్నారు.



ఓక్షిత వ్యూ హిల్ కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

అధికారులతో సమీక్ష..

డబుల్ బెడ్రూమ్ ఇళ్ల సముదాయంలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యను పరిష్కరించేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సోమవారం పేట్‌బషీరాబాద్‌లో క్యాంప్ కార్యాలయంలో ఆయన హౌసింగ్ బోర్డు, విద్యుత్, జలమండలి, ఇంజినీరింగ్ సెక్షన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబుల్ బెడ్రూమ్ పొందిన లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా మంచినీటి సరఫరా, పారిశుద్ధ నిర్వహణ, విద్యుత్ సరఫరా, వీధి దీపాల ఏర్పాటు, రవాణా సౌకర్యం, ప్రార్థనా మందిరాల నిర్మాణానికి స్థలాల కేటాయింపు పూర్తి చేయాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని రోజుకు రెండుసార్లు నీటిని సరఫరా చేయాలని, వీధి దీపాల ఏర్పాటుతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ వేయాలని ఆదేశించారు.

శివారుల్లో రాయితీ రాబడి రూ. 103.74 కోట్లు

2025-26 ఆర్థిక సంవత్సరానికి పన్ను చెల్లింపుపై 5 శాతం రాయితీ

పురపాలికల్లో ప్రజల స్పందనతో అత్యధిక రాబడి

సాక్షి, సిటీబ్యూరో: 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ముందస్తు పన్నుల చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ ప్రకటించడంతో ఇప్పటి వరకు విధించిన టార్గెట్‌లో 28.60 శాతం పన్నులు అంటే.. రూ.103.74 కోట్లు ప్రజలు చెల్లించడంతో మున్సిపల్ శాఖ అధికార వర్గాల నుంచి సంతృప్తి వ్యక్తం అవుతోంది. 33 రోజులు మాత్రమే ఐదు శాతం పన్ను రాయితీ వర్తింపు ఉండటంతో.. ప్రజల నుంచి చెల్లింపులు అంచనాకు వచ్చినట్లు భావిస్తున్నారు.

13 పురపాలక సంఘాల్లో పన్నులు ఇలా..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 13 పురపాలక సంఘాలకు సంబంధించి 2025-26 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన ఆస్తి, ఇతర పన్నుల వసూళ్లపై సర్కారు ఏప్రిల్ ఒకటి నుంచి మే 3 వరకు ఐదు శాతం రాయితీ ప్రకటించటంతో.. ఆశించిన మేర ఆదాయం రాబడి ఉన్నట్లు మున్సిపల్ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. నాలుగు నగర పాలక సంస్థలు, తొమ్మిది మున్సిపాలిటీల్లో విస్తృతంగా పన్ను రాయితీపై ప్రచారం నిర్వహించి ఉంటే వసూళ్లు పెరిగేవి అనే అభిప్రాయాలు స్థానిక ప్రజల నుంచి వ్యక్తం అవుతున్నాయి.



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఐదు శాతం పన్ను రాయితీ వసూలైన పన్నుల రాబడి వివరాలు ఈ విధంగా ఉన్నాయి

- బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.31.60 కోట్లకు రూ.8.98 కోట్లు (28.43 శాతం) వసూలు కాగా,
- పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.38.14 కోట్లకు రూ.12.96 కోట్లు (33.97శాతం) పన్నులు,
- జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.15.38 కోట్లకు రూ.2.35 కోట్లు (15.28శాతం),
- నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.78.08 కోట్లకు రూ.26.00 కోట్లు (33.31 శాతం) పన్నులు వసూలయ్యాయి.
- అలాగే, మున్సిపాలిటీలు పోచారంలో రూ.27.71 కోట్లకు రూ.4.28 కోట్లు (15.47 శాతం) పన్నులు వసూలు కాగా,
- తూముకుంటలో రూ.18.32కోట్లకు రూ.6.70 కోట్లు(36.59 శాతం),
- నాగారంలో రూ.22.61 కోట్లకు రూ.7.40కోట్లు (32.72శాతం),
- మేడ్చల్‌లో రూ.16.07కోట్లకు, రూ.5.05కోట్లు (31.42శాతం),
- కొంపల్లిలో రూ.17.99 కోట్లకు, రూ.5.11 కోట్లు(28.43శాతం),
- ఘట్‌కేసర్ రూ.11.14 కోట్లకు, రూ.2.03 కోట్లు (18.22శాతం),
- గుండ్లపోచంపల్లిలో రూ.21.35కోట్లకు, రూ.7.76కోట్లు(36.38శాతం),
- దమ్మాయిగూడలో రూ.23.27కోట్లకు, రూ.3.91 కోట్లు(16.82శాతం),
- దుండిగల్ మున్సిపాలిటీలో రూ.40.99కోట్లకు, రూ.11.16 కోట్లు (27.24శాతం) పన్నులు వసూలయ్యాయి.
- జిల్లాలో మొత్తం రూ.362.70 కోట్లకు గానూ రూ.103.74 కోట్లు(28.60 శాతం) వసూలయ్యాయి.